క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

కలికిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ మహమ్మద్ రియాజుద్దీన్ తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరవ్వాలని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు హాజరవ్వాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి


మాజీమంత్రి పెద్దిరెడ్డితో జల్లా రాజగోపాల్‌రెడ్డి

కలకడ : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. సోమవారం తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కోన సర్పంచ్, రాష్ట్ర పంచాయతీ విభాగం కార్యదర్శి జల్లా రాజగోపాల్‌రెడ్డి కలిశారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ బాధాకరమని, ఇలాంటి అక్రమ కేసులు ఎంతోకాలం చెల్లవని చెప్పారు. తనకు రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా ఎంపిక చేయడానికి కృషిచేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్‌విభాగం కార్యదర్శిగా ఎంపిక చేయడానికి కృషిచేసిన మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ మిథున్‌రెడ్డికి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేతాజీకి నివాళి


నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ, అధికారులు, విద్యార్థులు

బి.కొత్తకోట: నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ఆయన చిత్రపటానికి మండల విద్యాశాఖ అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆర్.రెడ్డిశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామ పోరాటంలో నేతాజీ పాత్ర మరచిపోలేనిదని అన్నారు. భారతీ జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని త్యజించి ఆజాద్ హింద్ ఫౌజ్ పేరుతో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం


పవన్‌కుమార్‌కు నగదు అందిస్తున్న దాతలు

కలకడ : పేద విద్యార్థికి ఆర్థిక చేయూతను అందించి మానవత్వం చాటుకున్నారు. కలకడ మండలం, కదిరాయచెర్వు గ్రామానికి చెందిన గ్రామస్తులు, ఉద్యోగులు, సర్పంచ్ కలిపి రూ.66,000 నగదు అందించి ఆదుకున్నారు. కదిరాయచెర్వు గ్రామానికి చెందిన ఎస్.పవన్ కుమార్ బీటెక్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నాడు. అయితే ఆర్థిక స్తోమత లేక సతమతమవుతున్నాడు. దీంతో కదిరాయచెర్వు గ్రామానికి చెందిన జిల్లా సర్వేయర్ రామిశెట్టి వెంకటరత్నం రూ.16,000, జిల్లా తొగటవీర క్షత్రియ సంఘం ఉపాధ్యక్షులు రామిశెట్టి రత్నమయ్య రూ.20,000, జక్కల శ్రీనివాసులు రూ.20,000, సర్పంచ్ లక్ష్మీప్రసన్న, పోస్ట్‌మెన్ కమల్‌నాథ్‌లు రూ.10,000 కలిపి రూ.66,000వేలు ఆర్థిక సాయం చేశారు.

ఘనంగా కుంభాభిషేకం


హోమం చేస్తున్న భక్తులు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తి శ్రద్ధలతో మహాకుంభాభిషేకం, వరుణయాగం, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు కుమారస్వామి, మంజునాథస్వామి సంప్రదాయబద్ధంగా యాగం నిర్వహించారు. రాత్రి దీపారాధన చేశారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేలాది మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఈఓ మునిరాజ, కొండకిట్ట ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించి దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

క్షయను నిర్మూలిద్దాం

మదనపల్లె సిటీ: క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కలిసి కృషి చేద్దామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయితే వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, హెడ్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, టీబీ సిబ్బంది ప్రభాకర్, శాంతి, సుజల, వనజకుమారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జ్యోతి, వైఆర్‌సీ కో ఆర్డినేటర్ గురుమూర్తి, ఖాజావల్లి పాల్గొన్నారు.

నర్సరీలపై.. ఏది నజర్?

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నష్టపోతున్న రైతులు

పెద్దతిప్పసముద్రం: అన్నదాతలు సాగు చేసే పంట దిగుబడి ఆశాజనకంగా రావాలంటే విత్తన నాణ్యత బాగుండాలి. లేని పక్షంలో రైతులు ఎంత పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసినా ఫలితం ఉండదు. కూరగాయల పంటల దిగుబడి బాగా ఉండాలన్నా విత్తన మొక్కల నాణ్యత బాగుండాలి. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

నిబంధనలు పాటించని నిర్వాహకులు

నారు పెంచే నర్సరీ చుట్టూ ఇన్‌సెక్ట్ నెట్ ఉండాలి. ఇన్‌సెక్ట్ నెట్‌కు ఎలాంటి చిల్లులు ఉండరాదు. డబల్ డోర్‌కు ఎలాంటి సందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. షెడ్ నెట్‌కు మూడు అడుగుల విస్తీర్ణం వరకు ఎలాంటి కలుపు చెట్లు ఉండకూడదు. నర్సరీ లోపల పసుపు రంగు జిగురు అట్టలు ఉంచాలి. నర్సరీ లోపల వైరస్ నిర్మూలనకు చుట్టూ ట్రాప్ క్రాప్ (బంతి మొక్కలు) వేయాలి. నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన కంపనీ బిల్లులు తీసుకోవాలి. నర్సరీకి సంబంధించిన ఏడు రిజిస్టర్లలో అన్ని వివరాలు సమగ్రంగా నమోదు చేయాలి. నర్సరీ లైసెన్స్ నంబర్ ప్రింట్ చేసిన బిల్లులు మాత్రమే నారు కొనుగోలుదారులకు ఇవ్వాలి. అయితే అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే కావడంతో నర్సరీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను గాలికొదిలేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కోకొల్లలు.



పెరిగిన పోటీతత్వం

వ్యాపారంలో పోటీతత్వం పెరిగిపోతోంది. ఏ నర్సరీలో ధర తక్కువగా ఉంటే అక్కడ కూరగాయల మొక్కలను కొనుగోలు చేస్తున్నారనే తప్పా.. మొక్కల నాణ్యతను చూడటం లేదు. నాణ్యత లేకుంటే దిగుబడి రాదు. ఫలితంగా రైతులకు పెట్టుబడి కూడా చేతికి దక్కదు. తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా ఉద్యానవన శాఖ అధికారులు పుట్ట గొడుగుల్లా వెలసిన నర్సరీలను పర్యవేక్షించి, అక్రమ నర్సరీలకు రిజిస్ట్రేషన్ చేయించి, రైతులకు విక్రయించే మొక్కల నాణ్యతను క్షుణంగా పరిశీలించి, కూరగాయల మొక్కల నాణ్యతపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పట్టించుకోని అధికారులు

విత్తన మొక్కల నాణ్యత పర్యవేక్షించాల్సిన ఉద్యానవన శాఖ అధికారులు ఉదాసీనత వహిస్తున్నారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పలు మండలాల్లోని ఎన్నో చోట్ల పదుల సంఖ్యలో నర్సరీలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని అన్నదాతలు వాపోతున్నారు. టమాటా, మిరప, వంకాయలతో పాటు ఇతర కూరగాయల మొక్కల పెంపకాన్ని నర్సరీ నిర్వాహకులు చేపడుతున్నారు. 2006 ఉద్యానవన శాఖ చట్టం ప్రకారం నర్సరీలు ఏర్పాటు చేసే ముందు నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అనంతరం రెన్యువల్ చేయించారా లేదా అని పరిశీలించాలి. నిర్వాహకులు పెంపకం చేసే మొక్కలను ఏ రైతులకు విక్రయిస్తున్నారో రశీదు రూపంలో చూపాల్సి ఉంది. అయితే సంబంధిత అధికారులు మాత్రం నర్సరీల వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మొక్కలను నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ఎలాంటి రశీదులు ఇవ్వకుండా విక్రయిస్తున్నారని పలువురు రైతులు చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీ పూర్వ వైభవానికి సమష్టి కృషి

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


మాజీ ఎమ్మెల్యే చింతలను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కలికిరి(వాల్మీకిపురం): వైఎస్సార్‌సీపీ పూర్వ వైభవానికి సమష్టి కృషి చేద్దామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కలకడకు చెందిన బరకం రవికుమార్‌రెడ్డి, వాల్మీకిపురం మండలానికి చెందిన జిల్లా రైతు విభాగం కార్యదర్శి మునర మోహన్ రెడ్డి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి జెట్రిపాటి విజయ్‌కుమార్, జిల్లా ఎస్సీసెల్ కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, వాల్మీకిపురం మండల ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, కార్యదర్శి నల్లంకి రామ్మోహన్ తమకు పార్టీలో సముచిత స్థానం కల్పించినందుకు వాల్మీకిపురం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతలను సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్, సెవెన్ హామీలలో ఏ ఒక్కటి పూర్తి స్థాయిలో అమలు చేయకుండానే అన్ని హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. స్త్రీ శక్తి పేరుతో మహిళలను మరోసారి చంద్రబాబు మోసం చేశారన్నారు. కేవలం కొన్ని బస్సులలో మాత్రమే ఉచిత ప్రయాణం కల్పించారని, అందులోనూ కొన్ని రూట్‌లలో ఉచిత ప్రయాణం కల్పించలేదన్నారు. ప్రతి పథకంలోనూ అరా కొరా అమలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, ఇలాంటి తరుణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనందరెడ్డి,ముని మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

- వాల్మీకిపురం పత్తేపురంకు చెందిన కొమ్మరగిరి రమేష్ కుమార్ మదనపల్లి పట్టణం వివేకానందనగర్‌లో నూతన గృహప్రవేశ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వాల్మీకిపురం మండలం కొత్త మంచూరుకు చెందిన కోటి సిద్దమ్మ మృతి సమాచారంతో వారి స్వగృహానికి వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కష్టపడి చదివితే.. ఇష్టమైన జీవితం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీకాంత్ కె. అరిమనిత్య

కురబలకోట: కష్టపడి చదివితే ఇష్టమైన జీవితంలో స్థిరపడవచ్చని బెంగళూరు క్వజార్స్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ కె. అరిమనిత్య పేర్కొన్నారు. యూనివర్సిటీ చాన్సలర్ నాదేళ్ల విజయ భాస్కర్‌చౌదరి ఆధ్వర్యంలో సోమవారం మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ మొదటి సంవత్సరం బిటెక్ తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీపై విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలిపారు. విజయానికి కృషి పట్టుదల ప్రధానమన్నారు. పరిశ్రమలకు తగ్గట్లుగా స్కిల్స్‌ను సాధించాలన్నారు. నూరేళ్ల భవిష్యత్ నిర్ణయం ఈ నాలుగేళ్లపై ఆధారపడి ఉంటుందని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. ఆ తర్వాత వంశపారంపర్యంగా కూడా జీవితాలే మారిపోతాయన్నారు. ల్యాబ్‌లు, ఆన్‌లైన్ ఎగ్జామ్స్, అడిషినల్ కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు, అంతర్జాతీయ సదస్సులు తదితర వాటిని వినియోగించుకోవాలని సూచించారు. చాన్సలర్ నాదేళ్ల ద్వారకనాథ్ మాట్లాడుతూ యూనివర్సిటీపై నమ్మకంతో చేరిన ప్రతి విద్యార్థికి తప్పకుండా ఉజ్వల భవిష్యత్‌ను అందిస్తామని తెలిపారు. శాస్త్ర సాంకేతిక, పరిశోధన, ఆవిష్కరణల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎఐ, డేటా సైన్స్, బ్లాక్ చైన్, మెషిన్ లర్నింగ్ వంటి నూతన సాంకేతిక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా కాలం విలువ తెలుసుకుని క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని పేర్కొన్నారు.

ఎంపీ విడుదల కావాలని తిరుమలకు పాదయాత్ర


తిరుమల పాదయాత్రను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : అక్రమ లిక్కర్ కేసులో అరెస్ట్ అయి జైల్లో ఉన్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ పీలేరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వి. హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి హరీష్‌రెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, చక్రధర్, హేమంత్‌రెడ్డి, భాను ప్రకాష్‌రెడ్డి, మహిత, హరిత, ద్రాక్షాయణి, మల్లీశ్వరి, షానబాజీబేగం, అరుణ, సఫూరా, రాజ్యలక్ష్మీ, రాజేశ్వరి, శారద, షాకీర్, దావూద్, కాలనీ చిన్న, వినోద్‌గౌడ్, ఆబీద్, చంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి, ఎస్.వి. చలపతి, పి. ద్వారకనాథరెడ్డి, రమేష్‌రెడ్డి, బడిగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, మునీర్, నరేష్ రులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం


పారిశుద్ధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి, సిబ్బంది

మదనపల్లె రూరల్ : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న 15 మంది పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం స్థానిక ఐసీటీసీ, ఏఆర్‌టీ, డీఎస్‌టీసీ, ఆర్ఎన్‌టీసీటీ విభాగాల ఉద్యోగులు సన్మానించారు. జిల్లా ఆస్పత్రిలోని డైక్ భవనంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించడం అభినందనీయమన్నారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ సయ్యద్ షుకుర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల, మైక్రోబయాలజీ ఇన్‌చార్జి శైలజ, డాక్టర్ హుమయూన్‌బాషా, ల్యాబ్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, ఐసీటీసీ, ఏఆర్‌టీ సిబ్బంది జయకుమార్, ప్రభాకర్, దీనదయాళ్, భారత్, పుల్లయ్యనాయుడు, రంజిత, దీప్తి, లీల, పురుషోత్తం, తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

ములకలచెరువు: కూటమి ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోయారని, దీంతో ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని సోమవారం స్థానిక మండల కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం వాహన మిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లను నగదు రూపంలో ఆదుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లకు బాసటగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ మదనపల్లె సబ్‌కలెక్టర్ ఎదురుగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఆటో డ్రైవర్లు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దేవదాయశాఖ భూములు కాపాడండి

మదనపల్లె రూరల్ : దేవదాయశాఖ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు కాపాడాలని, ఎండోమెంట్ అధికారులు వినతి పత్రం అందజేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. సబ్ కలెక్టర్ చల్లాకల్యాణి అధికారిక విధులపై తిరుపతికి వెళ్లడంతో ఆమె స్థానంలో డీఏఓ నిర్మలాదేవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దేవదాయశాఖకు చెందిన అధికారులు డీఏఓ నిర్మలాదేవిని కలిసి, మదనపల్లె, కురబలకోట, నిమ్మనపల్లె, ములకలచెరువు మండలాల్లో దేవదాయశాఖకు చెందిన భూములు ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి తమ జాయింట్ కమిషనర్, జిల్లా దేవదాయశాఖ అధికారితో 20వ తేదీ మీటింగ్ ఉన్న నేపథ్యంలో సుమారు 100 ఎకరాలకు ఆర్ఓఆర్ అప్పీలు తీసుకుని రసీదు ఇవ్వాల్సిందిగా కోరారు. గతంలో తహసీల్దార్‌లు దేవదాయశాఖభూములు, ప్రైవేట్ వ్యక్తుల మీద బదిలీ చేశారని, దీనిపై నోడేటా కింద కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఆర్ఓఆర్ కింద అప్పీలు తీసుకుని, భూములు తిరిగి దేవదాయశాఖకు చెందేలా చూడాలని కోరారు.

- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న చౌకదుకాణాలపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ ఫిర్యాదు చేశారు. ప్రతినెలా 26 నుంచి 1వతేదీ వరకు వృద్ధులకు ఇంటివద్ద పంపిణీ చేయాల్సిన రేషన్‌ను డీలర్లు పంపిణీ చేయడం లేదన్నారు. సమయపాలన పాటించకపోగా, తక్కువ తూకాలతో ప్రజలను మోసగిస్తున్నారన్నారు. రేషన్ దుకాణాల వద్ద ధరల పట్టికను ప్రదర్శించకుండా నచ్చిన రేట్లకు సరుకులు అమ్ముతూ దోచుకుంటున్నారని ఫిర్యాదు చేశారు.
- మదనపల్లె మున్సిపాలిటీ డెయిలీ, వారపుసంత గేట్లకు సంబంధించి రీటెండర్లను వెంటనే జారీచేసి, మున్సిపల్ ఖజానాకు జరుగుతున్న నష్టాన్ని అరికట్టాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి కె.మురళీ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీ సమర్పించారు. దినసరి, వారపుసంత గేట్లకు సంబంధించి టెండర్లు నాలుగునెలలుగా పెండింగ్‌లో ఉండటంతో మున్సిపల్ ఖజానాకు నెలకు 10లక్షలకు పైగా నష్టం వాటిల్లుతోందన్నారు. ఇప్పటికే రూ.40లక్షలు నష్టం వాటిల్లిందని, వెంటనే రీ టెండర్లకు అనుమతులు జారీ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

భూమి ఆక్రమణపై ఫిర్యాదు

కలికిరి: మండలంలోని గుండ్లూరు గ్రామం అద్దవారిపల్లి సమీపంలో గల ఎగువ ఆయిల కుంటచెరువు వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని ఇదే గ్రామానికి చెందిన ఆవుల సుబ్రహ్మణ్యం ఆక్రమించుకుని పంటలు సాగుచేస్తున్నారని, అంతే కాకుండా ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులో నిలిచిన వర్షపు నీరు నిల్వ లేకుండా ఎక్సవేటర్‌తో గాడి తీసి గండి కొట్టారని అద్దవారిపల్లి గ్రామస్తులు సోమవారం గ్రీవెన్స్ డేలో తహశీల్దారుకు ఫిర్యాదు చేశారు. చెరువుతూములకు కూడా గండి కొట్టాడని, దీంతో ఆయకట్టు రైతులకు ఇబ్బంది కరంగా మారిందని పిర్యాదు పేర్కొన్నారు. ఆక్రమణదారుపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆస్తి కాపాడి, ఆక్రమణలను తొలగించాలని కోరారు.

విలేజ్ క్లినిక్ ప్రారంభం

బి.కొత్తకోట: స్థానిక ఒకటవ వార్డు సచివాలయానికి విలేజ్ క్లినిక్ భవన నిర్మాణం చేపట్టకపోవడంతో దాతల సహాయంతో శిథిలావస్థలోని పాత పాఠశాల భవనానికి స్థానిక దాతలు ఆర్థిక చేయూత ఇవ్వడంతో సోమవారం ప్రారంభించారు. బైపాస్‌రోడ్డులోని పాత పాఠశాల భవనంలో విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించేందుకు నిర్ణయించగా నిర్వహణకు వీలులేకుండా ఉంది. దీనిపై స్పందించిన స్థానికు యువజనులు కుడుం శరత్, చిట్టా రామకృష్ణారెడ్డి చొరవతో పలువురు విరాళాలు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. వసూలైన రూ.48వేలతో భవనానికి మరమ్మతులు చేయించి సిద్ధం చేయగా దీన్ని పీటీఎం వైద్యాధికారి ప్రారంభించారు. వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి పి.సంధ్య జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మదన్‌మోహన్, పీడీ ఖాదర్‌భాషాలు తెలిపారు. ఏప్రిల్ నెల 25, 26 తేదీల్లో మదనపల్లె వశిష్ట ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అన్నమయ్య జిల్లా తరఫున ప్రతిభ చాటి జాతీయ స్థాయిపోటీలకు ఎంపికైందని పేర్కొన్నారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో బీహార్ రాష్ట్రం బుద్ధగయ ప్రాంతంలో జరిగే 44వ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థిని సర్పంచు శివకుమారి, ఎంపిటీసీ సభ్యులు మహేష్, ఎస్ఎంసీ చైర్మన్ రెడ్డిశేఖర్, గ్రామస్తులు అభినందించారు.

ప్రజాసమస్యలపై స్పందించాలి

తంబళ్లపల్లె: రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలపై స్పందించాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమీక్షా నిర్వహించారు. గ్రామాలలో వీఆర్‌ఓలు భూములకు స్పందించిన సమస్యలను ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని సూచించారు.

కులమతాలకు అతీతంగా సేవలందిస్తాం


మాట్లాడుతున్న కనుగొండ మద్దిరెడ్డి


రెడ్డిసంక్షేమసంఘం, మదనపల్లె కార్యవర్గం

మదనపల్లె రూరల్ : మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘానికి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు కనుగొండ మద్దిరెడ్డి తెలిపారు. సోమవారం రెడ్డి సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా మల్లయ్యకొండ మాజీ చైర్మన్, అఖిల భారత రెడ్డి సంక్షేమ సంఘం మాజీ ఉపాధ్యక్షుడిగా కనుగొండ మద్దిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవసలహాదారులుగా డాక్టర్ పి.ద్వారకనాథరెడ్డి, సి.తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా గుండ్లూరు దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కంభం నాగభూషణ్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా పి.ప్రసాద్‌రెడ్డి, కోశాధికారిగా ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయ సలహాదారులుగా ఆవుల శివరామిరెడ్డి, కంచి మంజునాథరెడ్డి, కోశాధికారిగా ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, సమన్వయకర్తగా పి.రామ్మోహన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా టి.రాజారెడ్డి, డి.మల్‌రెడ్డి, ఎస్.రెడ్డెప్పరెడ్డి, ఎన్.సురేంద్రరెడ్డి, జి.రామకృష్ణారెడ్డి, దండాల రవిచంద్రారెడ్డి, పి.నరేంద్రకుమార్‌రెడ్డి, పి.హరినాథ్‌రెడ్డి, ఆర్.శివకుమార్‌రెడ్డి, ఎం.దామోదర్‌రెడ్డి, ఎం.విజయ్‌కుమార్‌రెడ్డి, పి.ప్రసాద్‌రెడ్డి, రెడ్డిప్రసాద్ రెడ్డి, టి.జయచంద్రారెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు కనుగొండ మద్దిరెడ్డి, కంభం నాగభూషణరెడ్డి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా రెడ్డిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు.

నూతన కమిటీ ఎన్నిక

రెడ్డి సంక్షేమ సంఘం, మదనపల్లె, నూతన అధ్యక్షుడిగా గుడిబండ రవికుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా టి.రామచంద్రారెడ్డి, కోశాధికారిగా వై.గిరిధర్‌రెడ్డి, కోఆర్డినేటర్‌గా ఎస్.సాంబశివారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వి.సాంబశివారెడ్డి, జాయింట్ సెక్రటరీ కే.సుధాకర్‌రెడ్డి, కమిటీ మెంబర్లుగా తట్టి శ్రీనివాసులురెడ్డి, దండు కరుణాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, రామలింగారెడ్డి, రంగారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, అడ్వకేట్ శేషారెడ్డి, వై.నాగేశ్వరరెడ్డి, మస్తాన్‌రెడ్డి, వి.జనార్దన్‌రెడ్డి, జి.కోదండ రామిరెడ్డి, బి.రామకృష్ణారెడ్డి, నాగసుబ్బారెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శేషాద్రిరెడ్డి, ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్.మాధవరెడ్డి, రామలింగారెడ్డి ఎన్నికయ్యారు. రెడ్డిసంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం


ర్యాలీలో పాల్గొన్న అధికారులు

మదనపల్లె రూరల్ : సమాచార హక్కు చట్టం అందరికీ ఒక వజ్రాయుధం లాంటిదని కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సొసైటీ కాలనీలో సహకారశాఖ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది సంయుక్తంగా సమాచారహక్కు చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచారహక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారహక్కు చట్టం ప్రాధాన్యత, వివిధ సెక్షన్లు, సిబ్బంది చేయాల్సిన పనులు, పౌరులకు సమాచారం అందజేయడం తదితర అంశాలపై వివరించారు. 2005 అక్టోబర్ 12న రాష్ట్రపతి ఆమోదంతో సమాచారహక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా సామాన్యులు సైతం ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ సమాచారాన్ని అయినా అడిగి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ అధికారులు ప్రవీణ్‌కుమార్, బి.దుర్గ, మొయినుద్దీన్, పీఏసీఎస్ సీఈఓలు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

బి.కొత్తకోట: పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా విద్య బోధన జరగాలని అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి పీవీఎస్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన జిల్లా బాలికల అభివృద్ధి అధికారి శిరీషతో కలిసి స్థానిక ఆదర్శ విద్యాలయాన్ని తనిఖీ చేసి, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. తరగతి గదులు, హాస్టల్, విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ సౌకర్యాలపై, సమస్యలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేసి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. హాస్టల్ పరిశుభ్రతపై సూచనలు చేశారు. విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన విద్యాశక్తి కార్యక్రమం, విద్యార్థుల సన్నద్ధతపై సమీక్షించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు నాయక్, వార్డెన్ రెడ్డిలక్ష్మీ, ఉపాధ్యాయులు రామకృష్ణ, హనుమంతరెడ్డి, సురేంద్ర, కేశవులు, నాగసాయిలీల, సునీత పాల్గొన్నారు.

పాఠశాలను కొనసాగించండి

నిమ్మనపల్లె : మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ సింగంవారిపల్లె ఉర్దూ పాఠశాలను కొనసాగించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ఎంపీడీఓ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. గత 35 ఏళ్లుగా నడుస్తున్న పాఠశాలను మూసివేయడంతో తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు గత ఏడాది కూడా 14మంది విద్యార్థులు చదువుకున్నారని తెలిపారు. అయితే ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పాఠశాలలో జీరో అడ్మిషన్లు చూపించడంతో ప్రభుత్వం పాఠశాలను మూసివేశారని పేర్కొన్నారు. దీంతో తమ పిల్లలు ఇతర పాఠశాలకు వెళ్లాలంటే సుమారు 2కి.మీ. దూరం వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు స్పందించి సింగంవారిపల్లెలో పాఠశాలను తిరిగి ప్రారంభించాలని కోరారు. మునాఫ్, బాషాఖాన్, అయూబ్‌ఖాన్, ఫయాజ్, రఫీ, మురాషాఖాన్, ఇర్షాద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఇంటింటా మద్యం.. ఇదే బాబు విధానం


బాబు మోసంపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నిసార్ అహ్మద్, నాయకులు

మదనపల్లె: కూటమి పాలనలో రైతులకు ఎరువులు దొరకవు కానీ, ఏ వీధిలో చూసినా, ఏ పల్లెలో చూసినా మద్యం ఏరులై పారుతోందని, ఇదే చంద్రబాబు విధానమని మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహమ్మద్ విమర్శించారు. సోమవారం మదనపల్లె మున్సిపాలిటీలోని 6, 25 వార్డుల్లో కౌన్సిలర్లు ప్రసాద్ బాబు, ఈశ్వర్ నాయక్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ మనుజాతో కలిసి నిసార్ అహ్మద్ ఇంటింటా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఏడాదిన్నర సరిపోలేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష నేతలను రాజకీయంగా అణగదొక్కాలని చూస్తోందని, అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలతో చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఇర్ఫాన్ ఖాన్, సుధాకర్, వీఎస్ రెడ్డి, కౌన్సిలర్లు శివయ్య, రహీం, వేణుగోపాల్, రెడ్డప్ప, శ్రీనివాసులు, ఇమ్రాన్, జహీర్, హరీష్ నాయక్, హరిప్రసాద్ నాయక్, మంజుల, వినుతాబాయి, మేరీ, గ్రానైట్ మహేష్, మిట్టి మల్లికార్జున రెడ్డి, నూర్ మోదిన్ ఖాన్, రాజేష్, విశ్వనాథ్, అమ్మాజాన్, నాగమణి, చెన్నకేశవ, కొత్తపల్లి మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ దందాలపై విచారణ చేపట్టండి

మదనపల్లెలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఇంటి స్థలాల బోగస్ పట్టాలపై కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించాలని వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో పని చేసిన తహసీల్దార్ల పేరుతో నకిలీ పట్టాలు పుట్టుకొస్తున్నాయని ఆరోపించారు. దళారులు పేదల నుంచి రూ.లక్షలు దండుకుంటున్నారని చెప్పారు. అనపగుట్ట, కోళ్లబైలు, జగన్ కాలనీ, వైఎస్సార్ కాలనీ, పోతబోలు పంచాయతీలలో దళారుల పెత్తనం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటి పట్టాల మంజూరుకు సంబంధించిన అన్ని రికార్డులు ఉన్నాయా లేవా అని పరిశీలించి వీటిని సష్టిస్తున్న వారి గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భూ దందాలపై న్యాయ విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంలో అర్హులైన వారికి న్యాయం జరిగేలా అండగా ఉంటామని చెప్పారు.